క్లుప్తంగా

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి



కృత్తివెన్ను: వ్యవసాయ క్షేత్రంలో లోపాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుని నాణ్యమైన పంటలు పండించాలంటే ముందుగా మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో ఎస్.జెన్నీ అన్నారు. మట్టినమూనా పరీక్షలపై గురువారం వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులంతా తమ పొలాలలోని మట్టిని పరీక్ష చేయించుకోవాలన్నారు. దీని వల్ల పోషక లోపాలను గుర్తించి తగు సవరణలు చేయడం జరుగుతుందన్నారు. శిక్షణలో భాగంగా మట్టిని ఏ విధంగా సేకరించాలి, పరీక్ష ఎలా నిర్వహించాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈవో అజయ్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

పెడన: పురపాలక సంఘ పరిధిలో ఎస్సీ వర్గాలకు సబ్సిడీతో కూడిన స్వయం ఉపాధి రుణాలను మంజూరు చేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సేవలు, రవాణా, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. వయస్సు 21 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్నవారు తెలుపు రేషన్ కార్డ్, కుల, ఉపకుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్‌తో హెచ్‌టీటీపీఎస్://ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్// ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రవాణా పథకానికి దరఖాస్తు చేసే అభ్యర్థులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. దరఖాస్తుదారులకు పెడన పట్టణ స్థాయిలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హతల మేరకు ఎంపిక చేస్తారన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

కృష్ణా యూనివర్సిటీలో ఊడిపడిన సీలింగ్



మచిలీపట్నంరూరల్: కృష్ణా యూనివర్సిటీలో సీలింగ్ ఊడిపడటంతో విద్యార్థులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. మండల పరిధిలోని రుద్రవరంలో గల కృష్ణా యూనివర్సిటీలో అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఉషాను వివరణ కోరగా ఉదయం ఆడిటోరియం తలుపులు తెరిచేసరికి సీలింగ్ కూలిపోయి ఉందని బుధవారం రాత్రి ఏ సమయంలో కూలిపోయిందో తమకు తెలియదని చెప్పారు. అయితే సేకరించిన సమాచారం మేరకు ఆ సమయంలో ఆడిటోరియంలో విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ జరుగుతున్నట్లు తెలిసింది. అధ్యాపకులు వెంటనే విద్యార్థులను సెమినార్ హాలుకు మార్చినట్లు తెలిసింది.

కష్టాల్లో ఉన్న స్నేహితుడిని ఆదుకున్న మిత్రులు

పెడన: అనారోగ్యానికి గురై కష్టాల్లో ఉన్న స్నేహితుడికి ఆర్థిక సాయం అందించి స్నేహాన్ని చాటిచెప్పిన సంఘటన పెడన మండలంలో గురువారం చోటుచేసుకుంది. 1992–93లో మండలంలోని పెనుమల్లి జెడ్పీ హెచ్ఎస్‌లో పదో తరగతి కలిసి చదువుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన చోడవరం గ్రామ నివాసి దాసి తాతారావుకు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలిసిన సహచర మిత్రులు స్పందించి మిత్రుడిని ఆదుకునేందుకు అంతా కలిసి చందాలు వసూలు చేసి తమ వంతు సాయం కూడా అందులో కలిపి రూ.లక్ష సేకరించారు. రూ.75 వేలు తాతారావు కూతురి పేరున బ్యాంకులో డిపాజిట్ చేసి మిగిలిన రూ.25 వేలను చోడవరంలోని తాతారావు ఇంటికి వెళ్లి అతని చేతికి అందించారు.

ఇనుప రాడ్డుతో అన్నపై తమ్ముడు దాడి

కోడూరు: తల్లిని చూసేందుకు వచ్చిన అన్నపై తమ్ముడు ఇనుప రాడ్డుతో దాడి చేసిన ఘటన కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ చాణిక్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉల్లిపాలెం గ్రామానికి చెందిన గల్లా రామాంజనేయులు వృత్తి రీత్యా అవనిగడ్డలో స్థిరపడ్డాడు. ఉల్లిపాలెంలో ఉంటున్న తన తల్లిని చూసేందుకు గురువారం సాయంత్రం రామాంజనేయులు ఉల్లిపాలెం వచ్చాడు. తల్లి ఇంటికి సమీపంలో ఉన్న తమ్ముడు గల్లా శేషాద్రి రోడ్డుకు అడ్డుగా పైపులు, బండరాళ్లు పెట్టడంతో, రామాంజనేయులు వాటిని తొలగించాలని కోరాడు. అయితే శేషాద్రి వాటిని తొలగించకుండా 'నువ్వు నాకు చెప్పేదేంటి' అంటూ అన్న రామాంజనేయులుపై ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. ఈ ఘటనలో రామాంజనేయులకు బలమైన గాయాలు కావడంతో అవనిగడ్డ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నాడు విష ప్రచారం... నేడు యథావిధిగా భూ సర్వే

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 16 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే పూర్తి
- తాజాగా ఎన్డీయే ప్రభుత్వంలో ఒక గ్రామంలో ఫీల్డ్ వర్క్ పూర్తి
- మరో రెండు గ్రామాల్లో ఫీల్డ్ వర్క్..
- రైతులకు లబ్ధి చేకూర్చే భూ సర్వే



చోడవరంలో పుంత(మట్టిరోడ్డు), పంట పొలాలను రీ సర్వే చేస్తున్న అధికారులు, సర్వేయర్లు

పెడన: భూ సర్వే వల్ల ఎటువంటి ఉపయోగం లేదని, దాని వల్ల లాభం కంటే నష్టమే అధికమని ఎన్నికలకు ముందు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భూసర్వే చేయాలంటూ అధికారులను ఆదేశించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూసర్వేను పకడ్బందీగా నిర్వహించింది. భూసర్వే కారణంగా సరైన రికార్డులు లేని భూములకు సైతం పక్కా రికార్డులు, సరిహద్దులు కల్పించేలా అప్పటి అధికారులు చర్యలు చేపట్టారు. రైతులకు ఎంతో ప్రయోజనకరమైన భూ సర్వే కార్యక్రమంపై ఎన్నికల ముందు టీడీపీ నాయకులు విష ప్రచారం చేశారు. అబద్ధాలు వల్లె వేసి అధికారం చేపట్టిన ఎన్డీయే కూటమి సర్కారు ఎట్టకేలకు ఇప్పుడు భూ సర్వే కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వేలో పొలంలో ఎవరున్నారు, సాగు చేసేది కౌలు రైతా, లేక అసలైన రైతా అనే వివరాలను రెవెన్యూ సిబ్బంది డాక్యుమెంట్లను పరిశీలించి భూ సర్వే చేస్తున్నారు. వందల ఏళ్ల నాటి రికార్డులను ప్రక్షాళన చేస్తున్నారు.

గత ప్రభుత్వంలోనే 16 గ్రామాల్లో సర్వే పూర్తి

పెడన మండలంలో 31 రెవెన్యూ గ్రామాల్లో 16 గ్రామాల్లో గత ప్రభుత్వంలోనే భూ సర్వే ప్రక్రియ రికార్డు పరంగా పూర్తి చేశారు. నేలకొండపల్లి, పెనుమల్లి, లంకలకలువగుంట, నడుపూరు, కూడూరు, సింగరాయపాలెం, కమలాపురం, కొప్పల్లి, కాకర్లమూడి, జింజేరు, పుల్లపాడు, దేవరపల్లి, కవిపురం, గురివిందగుంట, కొంగంచర్ల, కుమ్మరిగుంట గ్రామాల్లో సుమారు 12వేల ఎకరాల భూమిని రీ సర్వే చేశారు. ఎన్డీయే కూటమి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత మండలంలో భూ సర్వేపై రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. చాలా మంది రైతులు తమకు చెందిన భూ సమస్యలను దరఖాస్తుల రూపంలో అధికారులకు అందజేశారు. చోడవరంలో ఎస్సీ కాలనీ వాసులు నడవడానికి పుంత(మట్టి రోడ్డు) ఉండేది. ఆ పుంత కాస్తా పంట పొలాల్లో కలిపేసుకున్నారని రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు చేసిన దాఖలాలున్నాయి. భూ సర్వే ప్రక్రియతో ఆ పుంత(మట్టి రోడ్డును)ను కాస్తా అధికారులు వెలికి తీశారు. భూ రీ సర్వేతో ఎస్సీ కాలనీ వాసులకు పుంత రోడ్డు ఏర్పడింది. ఈ ప్రభుత్వం మండలంలోని మూడు గ్రామాల్లో భూ సర్వే చేపట్టారు. ఇప్పటికే హుస్సేన్‌పాలెంలో ఫీల్డ్ వర్క్ పూర్తవగా సాంకేతికపరంగా సర్వే చేపట్టి రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంది. ముచ్చలిగుంట, దిరిశవల్లి గ్రామాల్లో ఫీల్డ్ వర్క్ ముమ్మరంగా చేస్తున్నారు. డెప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్‌లతో పాటు పలు సచివాలయాలకు చెందిన సర్వే కార్యదర్శులు సైతం ఈ సర్వేలో పాలుపంచుకుని భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.

ఉన్నతాధికారులిచ్చిన షెడ్యూల్ ప్రకారం భూ సర్వే



ప్రస్తుతం హుస్సేన్‌పాలెంలో సాంకేతికపరంగా భూ రీసర్వే చేయాల్సి ఉంది. ఫీల్డ్ వర్క్ పూర్తయింది. ముచ్చలిగుంట, దిరిశవల్లి గ్రామాల్లో కూడా ఈ నెలాఖరుకు ఫీల్డ్ వర్క్ పూర్తవుతుంది. భూ రీ సర్వే వల్ల వందల ఏళ్ల నాటి రికార్డులకు ప్రక్షాళన జరుగుతుంది. తాజా సమాచారంతో పాత రికార్డుల్లో ఉన్న సమాచారంతో క్రోడీకరించి అంతా ఆన్‌లైన్ చేస్తాం. భూ సర్వే వల్ల అనువంశీకులు ఆస్తులు, రికార్డులు లేని వారికి రికార్డులు, ఆయా రికార్డుల ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వడానికి మార్గం సులభతరం అవుతుంది.

– కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు

ముందస్తు హెచ్చరిక లేకుండానే కూల్చివేతలా?

మచిలీపట్నంటౌన్: బందరు నగరాన్ని అభివృద్ధి చేస్తామని ప్రముఖులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు స్వీకరించిన కూటమి ప్రజా ప్రతినిధులు చిరు వ్యాపారులతో ముందస్తు సమావేశం నిర్వహించకుండానే కూల్చివేతలు నిర్వహించటం ఎంతవరకూ సబబని నగర పాలకసంస్థ మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారుల దుకాణాలను నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న వారి దుకాణాలను నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేశారని విమర్శించారు. దీంతో వందలాదిమంది చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయి పొట్ట చేత పట్టుకుని నగరాన్ని వదలి వేరే ప్రాంతాలకు వలస వెళ్లి జీవిస్తున్నారన్నారు. ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని మళ్లీ రప్పించి చిరు వ్యాపారాలకు అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

రావివారిపాలెం(మోపిదేవి): మండలంలో అన్ని గ్రామాల్లోనూ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయాలని మండల వ్యవసాయాధికారి హెప్సిబా రాణి తెలిపారు. మండలంలోని రావివారిపాలెంలో గురువారం భూసార పరీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకుని వచ్చే ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుతూ పంట దిగుబడులు సాధించాలని సూచించారు. గ్రామ సచివాలయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమానాగమణి



ఘంటసాలలో తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ రమా నాగమణి



కృత్తివెన్నులో పోషకాహారాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, సీడీపీవో తదితరులు



ఐదుగుళ్లపల్లిలో జరిగిన పోషకాహార అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీడీ ఎం.ఎన్.రాణి

ఘంటసాల: తల్లీ బిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఘంటసాల సెక్టార్ సూపర్ వైజర్ టి.రమా నాగమణి అన్నారు. ఘంటసాల–1 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బరువు తక్కువ, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వైద్య పరీక్షలు చేయించడం, అవసరమైన పిల్లలను ఎన్ఆర్‌సీఏస్‌కు పంపించడంపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వై.సునీత, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

రెండేళ్ల పాటు బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

కృత్తివెన్ను: తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు ఆరోగ్యపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమాన్ని మండలస్థాయిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా గర్భవతిగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన ఆహారం గురించి, బిడ్డ పుట్టిన తరువాత ఆరునెలల పాటు తల్లిపాలనే ఇవ్వాలని తరువాత అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలు అందించాలని సూచించారు. ఎంపీపీ గరుడప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు అందుతున్న పోషకాహారం బాగుందని, నిరుపేద కుటుంబాల వారికి ఇది ఎంతగానో మేలు కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మైల రత్నకుమారి, తులసీరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామలాగౌరి, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు వెయ్యి రోజుల ప్రణాళిక

గూడూరు: గర్భవతి అయినప్పటి నుంచే పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వవచ్చని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎన్.రాణి అన్నారు. మండల పరిధిలోని ఐదుగుళ్లపల్లిలో గురువారం నిర్వహించిన పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోషకాహార ప్రాముఖ్యతను తెలుపుతూ ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందన్నారు. గర్భవతి అయిన మొదలు బిడ్డను ప్రసవించే వరకు 270 రోజులు, ఆ తర్వాత శిశువుకు రెండేళ్లు వచ్చేవరకు 730 రోజులు కలిపి వెయ్యి రోజుల ప్రణాళిక రూపొందించిందన్నారు. దీనికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందిస్తుందన్నారు. తద్వారా చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉండి, వ్యాధినిరోధక శక్తి కలిగి ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచి గోవాడ ప్రేమ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జన్ను రేవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, రజని, ఎంఎస్‌కే జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన

అరిసేపల్లి(మచిలీపట్నం రూరల్): మండలంలోని అరిసేపల్లి పంచాయతీ పరిధిలోని చిట్టిపాలెం గ్రామంలో అంగన్వాడి కేంద్రం వద్ద గురువారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ విజయకుమారి మాట్లాడుతూ చిన్నారుల పెంపకం, బాలింతలు, గర్భిణులు తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన



మట్టినమూనాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల కళాశాల విద్యార్థులు

వెంకటాపురం(మోపిదేవి): మట్టి నమూనాలు క్వాడ్రంట్ పద్ధతి(వి) ఆకారంలో మట్టి సేకరణపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన అవసరమని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఘంటసాల సమన్వయ కర్త, శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ వెంకటలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ సచివాలయం వద్ద గురువారం రైతులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వి ఆకారంలో భూమిని పలుచోట్ల జిగ్‌జాగ్ తీరులో తవ్వి మట్టిని సేకరించాలని సూచించారు. తరువాత దానిలో వ్యతిరేక భాగాలను అరకేజీ వచ్చేవరకు వేరుచేసి, ఆ అరకిలో మట్టిని ఒక కవర్‌లో వేసి దానిమీద రైతు వివరాలు, నేల వివరాలను రాయాలని తెలిపారు. అనంతరం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సామూహిక ఎలుకల నివారణపై చార్టు ప్రదర్శన ద్వారా వివరించారు. ఎలుకల మందు తయారుచేసి చుట్టలు, చుట్టి ఎలుకల బొరియల వద్ద వాటిని ఉంచాలని వివరించారు. డాక్టర్ నవీన్, డాక్టర్ మంజువాణి, డాక్టర్ యశ్వంత్, అభ్యుదయ రైతులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరరావు, రావి మధుబాబు, కావూరి సాయిబాబు, పలువురు రైతులు, బాపట్ల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల వజ్రోత్సవం



విద్యార్థులు, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, డీఈఓ రామారావు

కోడూరు: కోడూరులోని స్వతంత్రపురం చామర్తి ప్రకాశరాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఇదే స్ఫూర్తితో 100 సంవత్సరాల వేడుకలను కూడా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు సన్మానం..

పాఠశాలలో గత ఏడాది పదో తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను బుద్ధప్రసాద్, రామారావు ఘనంగా సన్మానించారు. వీరితో పాటు ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఎన్ఎంఎంఎస్, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. గత నాలుగేళ్ల నుంచి ప్రతిభ చాటిన విద్యార్థులతో పాటు ఈ ఏడాది విద్యాసంవత్సరంలో సత్తాచాటిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..

వజ్రోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు భరతనాట్యం, జానపద నృత్యాలు, సినిమా పాటలకు అనుగుణంగా డ్యాన్సులు చేశారు. వివిధ రకాల సందేశాత్మక స్కిట్లను ప్రదర్శించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థినులు పట్టు పరికిణీలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. హెచ్ఎం ఆలా వెంకటరమణ పర్యవేక్షణలో ఈ వేడుకలు నిర్వహించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ఫణి ధూర్జటి, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, ఎంపీఈఓ సుధాప్రవీణ్, ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, వి.శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: జాబ్‌మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి ఉద్యోగాలను అందుకోవచ్చని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నైపుణ్య అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జాబ్‌మేళా ద్వారా అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని నైపుణ్యం పెంచుకోవడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లే అవకాశం లభిస్తుందన్నారు. జాబ్ మేళా కార్యక్రమానికి 113 మంది అభ్యర్థులు హాజరుకాగా 76 మంది ఉద్యోగాలు పొందినట్టు చెప్పారు. మరో 14 మంది పైస్థాయి ఇంటర్వ్యూలకు హాజరైనట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్‌తో పాటు పలువురు సంస్థ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మినుములో చీడపీడల నివారణకు సూచనలు

చల్లపల్లి: ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు గురువారం మండల పరిధిలోని పుచ్చగడ్డ గ్రామంలో పర్యటించారు. మినుము పంటపై ఆశించే చీడ పీడల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం మినుముపై రసం పీల్చే పురుగు వ్యాపిస్తున్న దృష్ట్యా వాటి నిర్మూలనకు ఇమిడ క్లోప్రిడ్ 0.3 మి.మీ. లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు చొప్పున లేదా ఫిప్రొనిల్ 2 మి.లీ. చొప్పన ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందని శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి రైతులకు సూచించారు. తెల్లదోమ ఉధృతిని తగ్గించటానికి పసుపు జిగురు అట్టలను ఎకరా పొలంలో ఎనిమిది చొప్పున ఏర్పాటు చేసుకోవాలని ఆమె వివరించారు.

శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ 74వ వార్షికోత్సవం



శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవంలో బహుమతులు అందిస్తున్న సర్పంచ్ రవిప్రసాద్

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వర జెడ్పీ హైస్కూల్ ప్లస్ 74వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవంలో సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు మాట్లాడుతూ నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నతంగా అభివృద్ధి చెందాయని, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత విద్య, విద్యా కిట్లు అందిస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రయోజకులను చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన మురళీ కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా విద్యా, క్రీడా రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ కోడి కోటేశ్వరమ్మ, గోగినేనిపాలెం హైస్కూల్ హెచ్ఎం టి.వి.జి.రావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎనిమిది ఎకరాల గడ్డివామి దగ్ధం



వాటర్ పైపులతో మంటలను అదుపుచేస్తున్న స్థానికులు

చల్లపల్లి: అగ్నిప్రమాదంలో ఎనిమిది ఎకరాల గడ్డివామి దగ్ధమైన ఘటన స్థానిక పడమర వీధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పడమరవీధికి చెందిన గొరిపర్తి రాముకు చెందిన గడ్డివామి నుంచి ఒక్కసారిగా మంటలు లేచాయి. వెంటనే స్పందించిన స్థానికులు అవనిగడ్డ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. చుట్టుపక్కల ఉన్న నివాస గృహాల వారు తమ ఇళ్లలోని మోటార్లతో నీటిని గడ్డివామిపై చల్లటంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ఇంతలో ఫైర్ సిబ్బంది వచ్చి రాత్రి పొద్దుపోయే వరకూ మంటలను అదుపు చేస్తూనే ఉన్నారు. వరికోతలు మిషన్లతో కోయటం వలన వరిగడ్డికి డిమాండ్ పెరగటంతో ఎకరం రూ.10వేలు పెట్టి ఎనిమిది ఎకరాలు రూ.80వేలు పెట్టి గడ్డి కొన్నట్లు బాధితుడు గొరిపర్తి రాము తెలిపారు. ఇంటికి చేరా రవాణా ఖర్చులతో కలిపి మొత్తం రూ.లక్ష ఖర్చయిందని వాపోయారు. చుట్టపక్కల విద్యుత్ వైర్లు కూడా లేవని, అగ్నిప్రమాదానికి కారణాలు తెలియరాలేదని ఫైర్ సిబ్బంది తెలిపారు.

రామచంద్రరావుకు పలువురి నివాళి

ఘంటసాల: ప్రముఖ రచయిత, ఎన్నారై వేమూరి రాజేష్ తండ్రి వేమూరి రామచంద్రరావు ఇటీవల మరణించగా గురువారం ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎన్నారై మూల్పూరి వెంకట్రావు రామచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్, వేమూరి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల విద్యార్థినికి ఘన సన్మానం



చల్లపల్లి: ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన స్థానిక గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని మునిపల్లి వినీతను పలువురు ప్రముఖులు గురువారం ఘనంగా సన్మానించారు. ఇంటర్లో 1000 మార్కులకు గానూ 957 మార్కులు సాధించిన వినీతను స్థానిక విజయవాడ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలలు, శాలువాతో సన్మానించి ఆమె తల్లిదండ్రులు జయకృష్ణ, సీత దంపతులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు వినీతకు తమ వంతుగా కొంత నగదు సహాయం చేశారు.

పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి



చల్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామం పెరగాలని అప్పుడే మరిన్ని లక్ష్యాలను చేరుకోగలమని మండల విద్యాశాఖ అధికారి–2 పి.వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని నిమ్మగడ్డ ప్రాథమిక పాఠశాలలో గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన వివిధ అంశాలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.చెన్నకేశవ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవరపల్లి సురేష్‌బాబు, విజయభాస్కర్, ఎ.గోపాలకృష్ణ, ఎస్.సుగుణకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ దాసరి శ్రీను, సంగీతరావు, పి.నాగలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.